

కుమురం భీం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- బస్టాండ్ సమీపంలో భీం విగ్రహానికి పూలమాలతో నివాళి

2లో...



రూ.3.65లక్షల నగదు పట్టివేత

- బాసర మండలం బిద్రెల్లి చెక్‌పోస్ట్ వద్ద పోలీసుల తనిఖీలు
- బొలెరాలో తరలిస్తున్న మహారాష్ట్ర వాసి వద్ద నగదు స్వాధీనం

3లో...



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
8 పేజీలు | ఆదివారం | అక్టోబర్ 29, 2023 | www.navatelangana.com

ఆదిలాబాద్ జిల్లా..అభివృద్ధి ఖిల్లా

- చనాక-కోర్ట బ్యారేజీ నిర్మాణంతో కలను నిజం చేశాం
- ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి హరీశ్‌రావు
- బీఆర్ఎస్ అభ్యర్థులను ఆదరించాలని పిలుపు
- కార్యకర్తల్లో నూతనోత్తేజం నింపిన మంత్రి పర్యటన
- జిల్లా కేంద్రంలో గులాబీ శ్రేణుల భారీ ర్యాలీ


మాట్లాడుతున్న హరీశ్‌రావు


మోటార్ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగు రామన్న, నాయకులు, కార్యకర్తలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ అర్బన్, టౌన్

ఒకప్పుడు వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ పాలనలో అన్నిరంగాల్లో అభివృద్ధి చెందింది. ఇప్పుడు ఆదిలాబాద్ జిల్లా అంటేనే అభివృద్ధి ఖిల్లాగా నిలిచిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి జిల్లాకు మూడు మెడికల్, ఓ నర్సింగ్ కళాశాల మంజూరు చేశామని గుర్తు చేశారు. ఈ ప్రాంత వాసుల చిరకాల కోరిక అయిన లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టులో భాగంగా చనాక-కోర్ట బ్యారేజీని పూర్తి చేశామని, ఇటీవలే ట్రయల్ రన్ కూడా నిర్వహించడంతో ఈ ప్రాంత ప్రజల కల నెరవేర్చామని గుర్తు చేశారు. ఆనాడు లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టు కోసం తాను కూడా పాదయాత్ర చేపట్టానని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు హరీశ్‌రావు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్, బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థులు జోగు రామన్న, అనిల్‌జాదవ్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సిద్దిపేటతో పాటు ఆదిలాబాద్‌లోనూ రాష్ట్రం కోసం దీక్షా శిబిరం కొనసాగిందని గుర్తుచేశారు. ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థి డబ్బులిచ్చి టికెట్ కొనుక్కున్నారని, ఇటీవల కుక్కర్లు కూడా పంపిణీ చేశారని ఎన్ని జిమ్మిక్కులు చేసినా కాంగ్రెస్ గెలవడం అసాధ్యమని చెప్పారు. సీసీఐని తెరిపిస్తామని గత ఎన్నికల్లో హామీనిచ్చిన అమిత్‌షా మరోసారి ఎన్నికలు వచ్చే సమయానికి ఈ పరిశ్రమను తుక్కుకింద అమ్మేసే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. సీసీఐ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన బీజేపీ డిపాజిట్ గల్లంతు చేయాలని పిలుపునిచ్చారు.

కార్యకర్తల్లో నూతనోత్తేజం..!

మంత్రి హరీశ్‌రావు జిల్లా పర్యటన గులాబీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపింది. ఎన్నికల సమయంలో ఆయన ప్రసంగం ఆకట్టుకుంది. తెలంగాణ రాకముందు పరిస్థితి..వచ్చిన తర్వాత బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి..సంక్షేమాన్ని కండ్లకు

మిగతా..2లో...

భగ్గుమన్న అసమ్మతి

- ఆసిఫాబాద్ కాంగ్రెస్‌లో 'టిక్కెట్' చిచ్చు
- సిర్పూర్‌లో ప్రచారం ప్రారంభించిన రావి శ్రీనివాస్

కాంగ్రెస్ పార్టీ రెండో విడత జారీ చేసిన అసెంబ్లీ అభ్యర్థుల జాబితా ఆసిఫాబాద్‌లో చిచ్చు రేపింది. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ కోసం అసిఫాబాద్ నియోజకవర్గంలో పోటీ ఎక్కువగా ఉండడంతో ఇక్కడ అభ్యర్థి ఎంపిక క్లిష్టతరమే అవుతుందని ముందు నుండే భావించారు. అనుకున్నట్లుగానే ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చీలిపోయే పరిస్థితి రాగా, మరో నియోజకవర్గమైన సిర్పూర్(టి)లో మాత్రం టిక్కెట్ దక్కించుకున్న అభ్యర్థి ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రచారం చేసుకుంటున్నారు.



బోథ్‌లో సమావేశమైన కాంగ్రెస్ అసమ్మతి నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఆసిఫాబాద్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ టిక్కెట్ కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ప్రధానంగా టిక్కెట్ కోసం పోటీ ముగ్గురి మధ్యే నెలకొంది. చివరికి పార్టీ అధిష్టానం డీటీఓగా ఉండి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన శ్యాంనాయక్‌కు టిక్కెట్ కేటాయించింది. ముందు నుండి పార్టీని పట్టుకొని ఉన్న మర్సుకోల సరస్వతి, గణేష్ రాథోడ్‌కు మొండి చేయి చూపడంతో వారు కలిసికట్టుగా అధిష్టానంపై కత్తులు దూయడం ప్రారంభించారు. మర్సుకోల సరస్వతి ఒక మెట్టు పైకి ఎక్కి కాంగ్రెస్ అభ్యర్థి శ్యాంనాయక్‌ను ఓడించడమే తన ధ్యేయమని ప్రకటించింది. దీంతో ఆసిఫాబాద్ కాంగ్రెస్‌లో అయోమయ పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో ఆదివాసీ ఓట్లు అధికంగా ఉండడం, గత ఎన్నికలలో కాంగ్రెస్ నుండి ఆదివాసీ అయిన ఆత్రం సక్కు గెలుపొందడం

మిగతా..2లో...

గిరిజనుల ఆరాధ్య దైవం కుమురం భీం

- కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు
- కుమురం భీంకు ఘన నివాళి
- తరలొచ్చిన ఆదివాసులు, సాంప్రదాయబద్ధంగా పూజలు

నవతెలంగాణ-కెరమెరి

గిరిజనుల ఆరాధ్య దైవం కుమురం భీం అని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. శనివారం కుమురం భీం 83వ వర్ధంతి సందర్భంగా జోడేఘాట్ గ్రామంలో ఏర్పాటు చేసిన వేడుకలకు టీఏడీప పీఓ చాహత్ బాజ్‌పాయ్, ఎస్పి సురేష్ కుమార్, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి హాజరయ్యారు. ఆదివాసులు సాంప్రదాయ, గుస్సాడీ నృత్యాలతో స్వాగతం పలికారు. ముందుగా గిరిజన సాంప్రదాయాల మధ్య జెండా వద్ద పూజలు నిర్వహించి కుమురం భీం, కుమురం సూరు విగ్రహాలకు పూలమాలలు వేసి అనంతరం సమాధి వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం భీం వారసులు, మనుమడు

మిగతా..2లో...


సోనేరావ్ కుటుంబ సభ్యులకు వస్త్రాలు అందజేస్తున్న కలెక్టర్

నవతెలంగాణ
ఆదిలాబాద్
ఆదివారం అక్టోబర్ 29, 2023

ఎక్సైజ్ అధికారుల దాడులు



కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చింతగూడ కిరాణా దుకాణంలో మద్యం నిల్వలు ఉన్నట్లు అందిన సమాచారం మేరకు శనివారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఆఫీసర్స్ ఛాయిస్ 20 (180 ఎంఎల్), యునైటెడ్ గోల్డ్ 19 (180 ఎంఎల్) బాటిళ్లు స్వాధీనమైనట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. దుకాణం యాజమాని ఆనంద్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఈజ్‌గాంలో 30 లీటర్ల తాటి కల్లును కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్ఐ ఆర్ కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కుమురంభీం వర్ధంతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణంలో వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో శనివారం కుమురంభీం 83వ వర్ధంతిని నిర్వహించారు. పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో డాడానగర్ చౌరస్తాలో భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు ఎ శ్రీనివాస్‌రావు, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎనగంటి భిక్షపతి, పత్తిపాక శ్రావణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో కుంరంభీం విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు దాసరి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్‌కుమార్, గౌరవాధ్యక్షులు బూర సమ్మయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో..

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం కుంరంభీం 83వ వర్ధంతిని నిర్వహించారు. స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయంలో కుమురంభీం చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల కోసం పని చేసిన వారిని సమాజం ఎన్నటికీ మర్చిపోదని అన్నారు. అందులో కుంరంభీం ఒకరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చాపిలె సాయికృష్ణ, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

నవతెలంగాణ-బేల

మండలంలోని మాంగ్రూడ్ గ్రామంలో శనివారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్ర పటానికి రైతుబంధు సమితి జిల్లా సభ్యులు ఠాక్రె మంగేష్ పూలమాల వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బోయ కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భగ్గుమన్న అసమ్మతి

(మొదటి పేజీ తరువాయి)

తదితర కారణాలతో ఈసారి టిక్కెట్ తనకే దక్కుతుందని సరస్వతి భావించారు. కాని ఇటీవలే పార్టీలో చేరిన శ్యాంనాయక్‌కు టిక్కెట్ కేటాయించడం పట్ల ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇక సిర్పూరు నియోజకవర్గంలో పార్టీ టిక్కెట్ కోసం రావి శ్రీనివాస్, కోరళ్ల కృష్ణారెడ్డి పోటీ పడ్డా చివరికి రావి శ్రీనివాస్‌కు టిక్కెట్ దక్కింది. వారం రోజుల క్రితం నుండే రావి శ్రీనివాస్‌కు టిక్కెట్ వస్తుందని ప్రచారం జరిగింది. టిక్కెట్ కోసం పోటీలో ఉన్న కృష్ణారెడ్డి వారం రోజుల నుండే హైదరాబాద్‌కు పరిమితం కావడం, ఇక్కడ రావి శ్రీనివాస్ వారం రోజుల క్రితం నుండే గ్రామాల్లో ప్రచారం చేపడుతుండడంతో టిక్కెట్ ఎవరికనే విషయంలో సందేహాలు వీడిపోయాయి.

గిరిజనుల ఆరాధ్య దైవం కుమురం భీం

కుమ్రం సోనేరావు దంపతులకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల కోసం, నిజాం నవాబు సాగించిన దోపిడీ, దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించిన కుమురం భీం జల్, జంగిల్, జమీన్ నినాదానికి ప్రతీకగా నిలిచాడని కొనియాడారు. ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలు, జోడేఘాట్ గుట్టలు కేంద్రంగా నిజాం నవాబుపై గెరిల్లా పోరాటాన్ని కొనసాగించాడని పేర్కొన్నారు. నిజాం సైన్యం 1940 అక్టోబర్ 27న జోడేఘాట్ అడవుల్లోని కుమురం భీం స్థావరాన్ని ముట్టడించి భీంని హతమార్చారని తెలిపారు. స్వయంపాలన, అస్తిత్వం కోసం తన పోరాటాన్ని కొనసాగించాడని అన్నారు. ప్రభుత్వం గిరిజనులు, ఆదివాసుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని తెలిపారు. పోడు సాగు చేసుకుంటున్న అర్హులైన గిరిజన రైతులకు పోడు పట్టాలు అందించామని తెలిపారు. భీం వర్ధంతి సందర్భంగా వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకున్నామని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ సమన్వయంతో బందోబస్తు చర్యలు చేపట్టిందన్నారు. కుమురం భీం చరిత్ర, పోరాటాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆలపించిన గీతాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వరరావు, డీఎస్పీ వెంకటరమణ, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా అధికారులు, ఆదివాసులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలే కాంగ్రెస్ విజయానికి సోపానాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆరు గ్యారంటీలే కాంగ్రెస్ పార్టీని గెలిపించే సోపానాలని ఆదిలాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అందరి ఆశీర్వాదంతోనే తనకు టికెట్ వచ్చిందని, ఇది తన గొప్పతనం కాదని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. కాంగ్రెస్ టికెట్ ఖరారైన నేపథ్యంలో కంది శ్రీనివాసరెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. ఆదిలాబాద్ నియోజకవర్గం నలుమూలల నుండి పెద్దఎత్తున తరలివచ్చిన అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కేఎస్ఆర్‌కు పూలు బోకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే జోగు రామన్న అన్యాయాన్ని, అహంకారాన్ని అణచాలంటే అందరూ ఏకతాటిపైకి రావాలని, అందరినీ కలుపుకునిపోయి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. 30 రోజులపాటు జాగ్రత్తగా ఉండాలని, ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ గ్యారంటీ హామీలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యకర్తలే తన బలం, బలగమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు జోగు రామన్న, పాయల శంకర్ ఇద్దరు ఒక్కటయ్యారని అన్నారు. వారి ఓటమి ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. అందరి సహాయ సహకారాలతో 50వేల మెజార్టీతో గెలవబోతున్నామన్నారు. తనపై నమ్మకంతో ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి, రాహుల్‌గాంధీకి, ప్రియాంక గాంధీకి, రేవంత్‌రెడ్డికి, అధిష్టాన పెద్దలతోపాటు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి అందరం ఏకతాటిపైకి వచ్చి జోగు రామన్నను ఓడిస్తామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరిన పలువురికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మెన్ ముడుపు దామోదర్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మెన్ సెడ్మకి ఆనంద్‌రావు, నాయకులు ఐనేని సంతోష్‌రావు, డేరా కృష్ణారెడ్డి, ఎం.ఎ. షకీల్, కొండూరి రవి, మానే శంకర్, మీరాబాయి, తిరుమల్‌రెడ్డి, బూర్ల శంకర్ పాల్గొన్నారు.



• టికెట్ ఖరారు కావడంతో కందికి అభినందనల వెల్లువ

కుమురం భీం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆఆఆదివాసుల ఆరాధ్య దైవం కుమురం భీం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. భీం 83 వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక బస్టాండ్ ఎదురుగా గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిజాయితీగా, నిస్వార్థంగా ఆదివాసుల అభ్యున్నతికి పోరాడి తన ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు కుమురం భీం అని అన్నారు. జల్, జంగల్, జమీన్ కోసం భీం చేసిన పోరాటం మర్చిపోలేనిదని తెలిపారు. పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు ఆయన ఆశయ సాధనకు పాటు పడాలని అన్నారు. ఇప్పటికీ కొన్ని ఆదివాసీ తెగలు వెనకబడి ఉన్నాయని, వారి అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో అటవీ ప్రాంతంలో ఉన్న ఆదివాసులకు ఓటు హక్కు కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని, ప్రతి ఒక్కరు కచ్చితంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఆదివాసీ నాయకులు రాంకిషన్, కృష్ణ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లా..అభివృద్ధి ఖిల్లా

(మొదటి పేజీ తరువాయి)



కట్టినట్లు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం ఆగమవుతుందని.. ఇప్పటికే కర్ణాటకలో కేవలం మూడు గంటలు మాత్రమే కరెంటు ఇస్తోందని తెలిపారు. ఆ రాష్ట్ర రైతులు తెలంగాణకు వచ్చి నిరసనలు తెలుపుతున్నారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలపై ఆయన విమర్శనస్త్రాలు సంధించిన సందర్భంలో కార్యకర్తలు చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. మంత్రి మాట్లాడుతున్న సమయంలో కార్యకర్తలు, జనాలు ఆయన ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరించారు.

పట్టణంలో భారీ ర్యాలీ..!

మంత్రి హరీష్‌రావు రాకముందు పట్టణంలో ఎమ్మెల్యే జోగు రామన్న ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. వేలాది బైక్‌లతో మావల బైపాస్ నుంచి జిల్లా కేంద్రం వరకు నిర్వహించిన ఈ ర్యాలీతో పట్టణంతా గులాబీమయంగా మారింది. మావల నుంచి దస్నాపూర్, కుమురంభీంచౌక్, ఎన్టీఆర్‌చౌక్, వినాయక్‌చౌక్, అశోక్‌రోడ్, గాంధీచౌక్, అంబేడ్కర్‌చౌక్, నేతాజీచౌక్ గుండా డైట్ మైదానానికి చేరుకుంది. దారి పొడవున నాయకులు, కార్యకర్తలు జై తెలంగాణ..జై జోగు రామన్న నినాదాలతో హోరెత్తించారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణంలోని వార్డుల్లోని జనాలు పెద్ద ఎత్తున తరలించారు. బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల ద్వారా జిల్లా కేంద్రానికి రావడంతో ఇక్కడ సందడి వాతావరణం నెలకొంది. భారీ స్థాయిలో ర్యాలీ నిర్వహించడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సంక్షేమ పథకాలే ఆయుధాలుగా : ఎమ్మెల్యే జోగు రామన్న

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే ఆయుధాలుగా ప్రజల్లోకి వెళ్లాలని ఎమ్మెల్యే జోగు రామన్న కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ తొమ్మిదేండ్లలో నియోజకవర్గంలో రూ.5200కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. కాంగ్రెస్ పదేండ్ల పాలనలో ఏం చేసిందని ఎద్దేవా చేశారు. మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని..ఆదిలాబాద్‌లో జోగు రామన్న, బోథ్‌లో అనిల్‌జాదవ్‌ను గెలిపించాలని కోరారు. పట్టణంలో 15వేల బైక్‌లతో ర్యాలీ నిర్వహించామని ఈ ర్యాలీకి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిర్మల్
ఆదివారం అక్టోబర్ 29, 2023

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

నవతెలంగాణ-కడెం

మండలంలోని అంబారిపేట్ గ్రామంలో శనివారం వాల్మీకి జయంతి వేడుకలు బోయ కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామాయణం రచించిన వాల్మీకి గురించి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబారిపేట్ గ్రామ సర్పంచ్ కొప్పుల లక్ష్మీ లచ్చన్న, ఎంపీటీసీ కట్ల సింధుజ సాగర్, బోయ కులస్తులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



నామినేషన్ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-నిర్మల్

త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులకు, సహాయ రిటర్నింగ్ అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారు లకు నామినేషన్ ప్రక్రియపై మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 3వ తేదీ నుంచి అసెంబ్లీ ఎన్నికల నామినేషన్‌ల స్వీకరణకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అభ్యర్థులు నవంబర్ 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ దాఖలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేయాలని, అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌లో ఎలాంటి బ్లాంక్‌లు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. చెక్ లిస్ట్ ప్రకారం నామినేషన్ ఫారం అభ్యర్థులు సమర్పించేలా చూడాలన్నారు. నామినేషన్ స్క్రూటినీ రిటర్నింగ్ అధికారి మాత్రమే చేయాల్సి ఉంటుందన్నారు. 13న నామినేషన్‌లను పరిశీలించడం, 15 వరకు ఉపసంహరణకు గడువు ఉంటుందని, నవంబర్ 30న పోలింగ్ జరుగుతుందని తెలిపారు. అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీఓలు రత్న కళ్యాణి, జివాకర్, కోమల్‌రెడ్డి, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల నిర్వహణ అధికారులకు అవగాహన కార్యక్రమం

ప్రతి కార్యకర్త సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

ప్రతీ కార్యకర్త సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయమని మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పొట్టపెల్లి(కే) గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తోడిశెట్టి గంగారాం ఇటీవల గుండె సంబంధిత సర్జరీ చేసుకొని రావడంతో మండల బీఆర్ఎస్ ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి పరామర్శించారు. ప్రతీ కార్యకర్తకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కృష్ణారెడ్డి, సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు, రవీందర్, చిన్నారెడ్డి, నరేష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించాలి



నవతెలంగాణ-ముధోల్

రానున్న ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించాలని మండల రైతుబంధు అధ్యక్షుడు రామ్‌రెడ్డి అన్నారు. మండలంలోని విట్టోలి తండా, రాజు తండా, విట్టోలి గ్రామంలో శనివారం ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ముధోల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, నాయకులు రవింధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పోతన్నయాదవ్, మురళీ, బోయిడి అనిల్, శంకర్, నగేష్ పటేల్ పాల్గొన్నారు.

పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలను నమోదు చేయాలి



ఎన్నికల నిర్వహణ అధికారులకు శిక్షణనిస్తున్న మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్

నవతెలంగాణ-నిర్మల్

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఖర్చుల వివరాలను ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలలో నమోదు చేయాలని ఆదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో అకౌంటింగ్ టీం, ఎస్ఎస్‌టీ, విఎస్‌టీ, వీవీటీ టీమ్ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్ సంబంధిత వివరాలను వెల్లడించారు. ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు, ఎంసీఎంసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ టీం, వీడియో సర్వేలెన్స్ టీం, వీడియో పరిశీలన టీం, అకౌంటింగ్ టీంలు ఏర్పాటు చేశారని తెలిపారు. జిల్లాలోని నిర్మల్, ముధోల్, ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఆమోదం, ఆమోద యోగ్యం కాని ఖర్చుల వివరాలను సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీం, వీఎస్టీ, వీవీటీలు నమోదు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు అభ్యర్థుల ద్వారా నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్‌షోలో అన్నింటినీ వీడియో సర్వేలెన్స్ టీం సభ్యులు రికార్డింగ్ చేసి, వీడియో పరిశీలన సభ్యుల ద్వారా సదరు వీడియో పరిశీలించి, వివరాలను అకౌంటింగ్ టీం సభ్యులకు అందజేయాలని అన్నారు. అకౌంటింగ్ టీం సభ్యులు వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని అన్నారు. అనంతరం పూర్తి వివరాలను సహాయ వ్యయ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులకు అందజేయాలన్నారు. ర్యాలీలు, సమావేశాల ద్వారా నిర్వహించిన పార్టీ, ప్రచార ఖర్చులు నిర్ణయించిన రేట్ల ప్రకారం నమోదు చేయాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు తమ ప్రచార వ్యయ ఖర్చుల అకౌంట్లు, రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా బృందాల విధులు, భాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈఓ రవిందర్‌రెడ్డి, జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారిణి విజయ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి అల్లోల

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని దని మాజీ సర్పంచ్ గుర్రం శేఖర్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మంత్రి వెంట పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్ రెడ్డి, రైతుబంధు అధ్యక్షులు నల్ల వెంకట్ రామ్‌రెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, అడెల్లి చైర్మెన్ చందు నాయకులు ప్రభాకర్ రెడ్డి, మాధవ్ రావు, శ్రీనివాస్ ఉన్నారు.

రూ.3.65లక్షల నగదు పట్టివేత

నవతెలంగాణ-బాసర

అంతర్‌రాష్ట్ర సరిహద్దు బిద్రెల్లి చెక్‌పోస్టు వద్ద శనివారం సాయంత్రం వాహన తనిఖీల్లో భాగంగా రూ.3.65లక్షలు పట్టుబడినట్టు ఎస్సై గణేష్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన వ్యక్తులు బొలెరో వాహనంలో వెళ్తుండగా చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా వారి వద్ద నుంచి రూ.3.65లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేయడం జరిగిందని ఎస్సై గణేష్ తెలిపారు. ఎన్నికల నియమావళి మేరకు రూ.50 వేలకు మించి డబ్బులు తీసుకెళ్లరాదని ఎస్సై తెలిపారు. వాహన తనిఖీల్లో పోలీసు సిబ్బందితో పాటు బీఎస్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పొట్యా సర్పంచ్ సురేఖ కైలాస్

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని పొట్యా గ్రామసర్పంచ్ సురేఖ కైలాస్‌తో పాటు బండరేవు, సిరిపెల్లి, లింగాపూర్, దుప్యా తండా, రాంసింగ్ తండా, గ్రామస్తులు పెద్ద ఎత్తున శనివారం బీఆర్ఎస్ పార్టీని వీడి నిర్మల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీహరీరావు ఆధ్వర్యంలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే సుస్థిర పాలన సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, నిర్మల్ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దశరత్ రాజేశ్వర్, మండల ఇన్‌చార్జి బొల్లోజి నర్సయ్య, నాయకులు హధీ, సురేందర్,



మారుతీ, కొత్తపెల్లి విలాస్‌రావు, ముత్యంరెడ్డి, రాజారెడ్డి, లక్ష్మణ్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

మహిళా రైతుపై కక్షసాధింపు

• మందుకొట్టే నీటిలో గడ్డి మందు కలిపిన వైనం



వాడిపోయిన పత్తి పంట

నవతెలంగాణ-భీమారం

మండలంలోని పోతన్‌పల్లి గ్రామానికి చెందిన ధరావత్ రమాదేవి ఒక ఎకరా పత్తి పంట సాగు చేస్తుంది. వర్షాభావ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పత్తి పంట పూత రాలుతున్న క్రమంలో పూత రాలకుండా నివారణకు పిచికారి మందు కొట్టింది. ఐతే పిచికారి కోసం కావాల్సిన నీటిని ఒక రోజు ముందే పంట చేళ్ళో డ్రంబులో నిల్వ చేసుకోగా గుర్తు తెలియని వ్యక్తులుఅందులో గడ్డి నివారణ మందును కలిపారు. ఇది తెలియని రమాదేవి శక్రవారం ఉదయం అదే నీటితో పూతరాలకుండా నివారించే మందును పిచికారి చేసింది. దీంతో శనివారం మధ్యాహ్నం పత్తి పంటను గమనించగా పత్తి పంట వేలబోయి కనిపించడంతో బాధితురాలు తీవ్ర ఆవేధనకు లోనైంది. రమాదేవి భర్త ఈ మధ్యనే ఆనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటికే భర్త పోయి ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతుండాగా పంట సాగు కోసం అప్పు తీసుకొచ్చింది. దీంతో బాధితురాలు తమకు నష్టం కలుగజేసిన నిందితులను గుర్తించి, తగిన న్యాయం చేయాలని వేడుకొంటుంది. ఈ విషయమై ఏఈఓ అరుణ్ కుమార్‌ను వివరణ కోరగా.. సంబందిత రైతు నుంచి సమారం అందడంతో పత్తి పంటను పరిశీలించారు. రైతు కొనుగోలు చేసిన మందుల రసీదుతో పాటు మందులను పరిశీలించారు. పిచికారి చేసిన మందులతో పంటకు ఎలాంటి నష్టం కలుగదు. కనుక రైతు పిచికారి చేసిన నీటిలో గడ్డిమందు కలిపి ఉంటారనే అనుమానం వ్యక్తం చేయడంతో దాని నివారణకోసం చక్కర కలిపిన నీటిని, మరో రెండు రోజుల తర్వాత నానో యూరియా పిచికారి చేయడం ద్వారా పంట సాధారన స్థితికి వస్తుందని తెలిపారు.

ప్రచారానికి దరఖాస్తు తప్పనిసరి

నవతెలంగాణ-తాండూర్

వివిధ పార్టీల నేతల గ్రామాల్లో పట్టణాల్లో నిర్వహించే ప్రచారాలు, ప్రసార సాధనాల వాడకం కోసం అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభలు సమావేశాలు, మైక్ వాడకం, వాహనానికి, ర్యాలీలకు, ఇంటింటా ప్రచారానికి, గుర్తులను పంచడానికి, స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లకు పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. అనుమతి కోసం 48 గంటల ముందు సువిధ ఆప్‌లో దరఖాస్తూ చేసినట్లయితే పరిశీలించి ఎన్నికల అధికారి అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. పార్టీ అభ్యర్థులు ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ప్రచారం నిర్వహించుకోవాలన్నారు. రోజుకు ఎన్ని దరఖాస్తులు అయిన ఇవ్వొచ్చునని, దరఖాస్తూలో ఏ తేదీన ఏ సమయంలో ఏ ఊరు లేక వాడలో ప్రచారానికి అనుమతి కావాలో క్లుప్తంగా తెలియజేయాలన్నారు. మైక్ అనుమతి పొందడం అంటే డీజే అనుమతి ఇచ్చినట్టు కాదని సింగిల్ స్పీకర్ సౌండ్ సిస్టం బాక్స్‌లను మాత్రమే వాడాలన్నారు. ప్రచారంలో డీజేలకు అనుమతి లేదని తెలిపారు.

ప్రధాన మంత్రి మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-ఆదిలాబాద్

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని సూర్యాపేటలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించడాన్ని బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి ధన్యవాదలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నస్పూర్ పట్టణ ప్రధాన కార్యదర్శి పిట్టల రవి, మైనారిటీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాషా, బీజేవైఎం నాయకులు తాడూరి మహేష్, కొంతం మహేందర్, బద్రి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-జన్నారం

ముఖ్య మంత్రిగా బీజేపీ బీసీ అభ్యర్థి ప్రకటించడంతో శనివారం బీసీ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీసీ సంఘం రాష్ట్ర నాయకులు కోడూరు చంద్రయ్య మాట్లాడుతూ బీజేపీ అత్యధిక సీట్లు బీసీలకు కేటాయించి ముఖ్య మంత్రి పదవిని ఇస్తామనటం గొప్ప విషయం అన్నారు. బీసీలను గుర్తించిన పార్టీ బీజేపీ అని అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కాసెట్టి లక్ష్మణ్, కొంతం శంకరయ్య, శ్రీరాముల గంగాధర్, భూమా చారి, విజయ్, మండల అధ్యక్షుడు గోలిచందు పాల్గొన్నారు.

క్రీడాలతో స్నేహభావం పెరుగుతుంది



నవతెలంగాణ-రెబ్బెన

క్రీడలతో మానసిక ఉల్లాసం, స్నేహభావం పెరుగుతుందని బెల్లంపల్లి ఏరియా డీజీఎం సివిల్ ఆర్ సతీష్ బాబు అన్నారు. శనివారం డబ్ల్యూపీఎస్అండ్‌జీఏ 90వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా గోలేటి శ్రీ భీమన్న క్రీడా మైదానంలో అన్ని డిపార్టుమెంట్లతో క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు శారీరకంగా, మానసికంగా దోహదపడంతో పాటు ఉద్యోగుల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో ఖైరిగూడ పీఓ జట్టుపై ఎస్ఓటు జీఎం గ్రూప్ జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలుపొంది. కార్యక్రమంలో స్పోర్ట్స్ సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, కోఆర్డినేటర్ మురహరిరావు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి : రాంబాబు



నవతెలంగాణ-నార్నూర్

గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యుడు రాంబాబు సూచించారు. శనివారం గుంజాల గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉపకేంద్రం అనుబంధ గ్రామాలకు చెందిన 20 మంది గర్భిణులకు ఉచిత మందులు పంపిణీ చేశారు. సంపూర్ణ పోషకాహారం ప్రాధాన్యత, కాన్పుల మధ్య వ్యవధి కోసం తాత్కాలిక పద్దతులు పాటించేవిధంగా అవగాహన కల్పించారు. నెలనెలా టీకా తీసుకోవాలని తద్వారా తల్లి పిల్లల ఆరోగ్యం మెరుగుపడి ఆరోగ్యంగా మానసికంగా ఆర్థిక పరంగా ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు జరిగితే ప్రభుత్వ పథకాలకు అర్హులు అవుతారని పేర్కొన్నారు. వైద్యశిబిరంలో హెచ్ఇఓ నాందేవ్, వైద్య సిబ్బంది సుశీల, సత్తవ్వ, చౌహన్ చరణ్‌దాస్ పాల్గొన్నారు.

హరీష్‌రావు సభకు ఉట్నూర్ వెల్లిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-జన్నారం

ఉట్నూరులో శనివారం నిర్వహించిన ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, ప్రజా ఆశీర్వాద సభకు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు త తరలి వెళ్లారు. మండలంలోని 29 గ్రామపంచాయతీలు 33 గ్రామాల నుంచి వేలాదిగా మంది బస్సులలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాం రెడ్డి ఎంపీపీ మాదాడి సరోజన జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్లు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ఎలా ప్రజల్లోకి తీసుకెళ్లాలని విషయంపై మంత్రి హరీష్ రావు ఈ సభలో కార్యకర్తలకు ప్రజలకు దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

కెరమెరి : ఆధ్యాత్మిక గురువు, తపస్వి రాంరావ్ మహరాజ్ సూచించిన ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ నాయక్, సేవాలాల్ ఉత్సవ కమిటీ చైర్మెన్ రాథోడ్ శంకర్ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో రాంరావ్ మహరాజ్ వర్ధంతిని పురస్కరించుకోని ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంజారాల ఆధ్యాత్మిక గురువు సూచించిన మార్గంలో నడవాలన్నారు. అంతకు ముందు బంజారాల సంప్రదాయ పద్దతిలో భోగ్‌బండార్ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివాజీ, అంబాజీ, వెంకటి, లాలూ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వృద్ధురాలు ఆత్మహత్య

బోథ్ : పురుగులమందు తాగి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సొనాల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సొనాల గ్రామానికి చెందిన పటెన్ల రుక్మబాయి(73) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గత కొన్ని రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నది. ఆస్తమా సైతం ఉండటంతో చలి కాలం ఆస్తమా ఎక్కువైందని జీవితంపై విరక్తి చెంది తన ఇంట్లోనే పురుగులమందు తాగింది. కుటుంబీకులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాములు తెలిపారు.

పంచశీల, అష్టాంగ మార్గాలను ప్రతి ఒక్కరూ పాటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బుద్ధుడు చూపించిన పంచశీలు, అష్టాంగ మార్గాలను ప్రతి ఒక్కరూ పాటించాలని లుంబిని బుద్ధ విహార్ కమిటీ అధ్యక్షులు గజానంద్ తాక్‌సండే అన్నారు. శనివారం మండలంలోని పిప్పల్‌దరి లుంబిని బుద్ధ విహార్‌లో వర్షవాస్ ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పంచశీల జెండాను ఎగరవేసి బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. వందన పఠించి, బోధిబిక్షం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వర్ష వాస్ ముగింపు సందర్భంగా చివరి పాటాన్ని చదివి వినిపించారు. వర్షవాస్ కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించిన గులే మోహన్ తాక్‌సండే శ్రీకాంత్, టంకే ఈశ్వర్, భగత్ కైలాసలను సన్మానించారు. అనంతరం మహా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన భజన సంస్కృతి కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు భగత్ విటల్, పిప్పల్‌దరి తాక్‌సండే నిలకాంత్, సభ్యులు మునీశ్వర్ విట్టల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ రద్దు చేయాలని డిమాండ్

• ముక్తకంఠంతో వ్యతిరేకించిన నాయకులు, కార్యకర్తలు



నవతెలంగాణ-బోథ్

వన్నెల అశోక్‌కు కేటాయించిన ఎమ్మెల్యే టికెట్ రద్దు చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని పున్ణపరిశీలన చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు టికెట్ స్థానిక నాయకులకు కేటాయించాలని అన్నారు. అలాగే వన్నెల అశోక్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనకు టికెట్ కేటాయిస్తే కాంగ్రెస్ పార్టీ కనీస పోటీ కూడా ఇవ్వలేదని సామాజిక వర్గాల సమతుల్యత లోపిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు కాంగ్రెస్ పార్టీని నాశనం చేయడానికి బలహీనమైన అభ్యర్థులను ఎంపిక చేసి అధికార పార్టీకి న్యాయం చేసే విధంగా కోవర్టు ఆపరేషన్ నడుపుతున్నాడని విమర్శించారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కార్యవర్గం సీఎల్పీ నేత, సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ ఆలోచించి, గెలిచే స్థానిక అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని ఎడల అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకున్న మిగతా అభ్యర్థుల అందరితో కలిసి ఉమ్మడి రెబల్ అభ్యర్థిని ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసుల హక్కులను కాపాడాలి

- ఘనంగా కుమురంభీం వర్ధంతి
- ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసీ హక్కులను కాపాడి ఏజెన్సీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలనీ తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్త్రాతి డిమాండ్ చేశారు. కుమురంభీం 83వ వర్ధంతి సందర్బంగా శనివారం జిల్లా కేంద్రంలో బస్టాండ్ సమీపంలో ఉన్న కుమురంభీం విగ్రహానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్, టీఏజీఏస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఆదివాసీ చట్టాలను కాలరాస్తున్నాయని అన్నారు. కుమురంభీం ఆశయాలు జల్.. జంగల్.. జమీన్‌పై ఆదివాసులకు హక్కులు లేకుండా చేస్తున్నారు. వారిని అడవి నుంచి దూరం చేస్తూ భూమిపై హక్కులు లేకుండా చేస్తున్నారన్నారు. కుమురంభీం స్పూర్తితో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల ఆదివాసీ వ్యతిరేక విధానాలపై ఆదివాసులు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రమాకాంత్, రమేష్, ఆదివాసీ నాయకులు సిడాం రామ్ కిషన్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌రూరల్‌లో...

సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆద్వర్యంలో..

సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా కార్యాలయంలో శనివారం కుమురంభీం 83వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమురంభీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు జిల్లా నాయకులు జగన్‌సింగ్ మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన వీరుడు కుమురంభీం అని అన్నారు. జల్.. జంగల్.. జమీన్.. నినాదంతో గిరిజనుల కొరకు పోరాడు హక్కులను సాధించిన నిజాం, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు, గిరిజన సమరయోధుడు అన్నారు. కుమురంభీం వర్ధంతిని పాలకవర్గాలు మర్చిపోవడం బాధాకరమని కొనియాడారు. అదేవిధంగా కుమురంభీం ఆశయాల సాధన కొరకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వామన్, సురేష్, నితిన్, బుచ్చిరాం, జంగు భాయ్, వర్షా బాయ్, అయ్యో పటేల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో...

జల్.. జంగల్.. జమీన్.. కోసం పోరాడి వీరమరణం పొందిన కుమురంభీం వర్ధంతి, జయంతిలను నిర్వహించడం కాదని, ఆదివాసులకు పూర్తి హక్కులు కల్పించిన రోజునే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని ఆదిలాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కుమురంభీం వర్ధంతి సందర్భంగా శనివారం. కలెక్టర్‌చౌక్‌లో భీం విగ్రహానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘన నివాళ్లర్పించారు. కుమురంభీం పోరాట స్పూర్తిగా ఆదివాసులకు అడవులపై పూర్తి హక్కులు కల్పించాలని అన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలన్నారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినట్టుగా పోడు భూములకు పట్టాలు అందజేయాలన్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. అప్పుడే అమరులైన ఆదివాసీ వీరులకు నిజమైన నివాళులు అర్పించినట్టని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఆదివాసులు బతుకులు మారలేదన్నారు. అడవుల నుంచి తరిమికొట్టిందన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. ఆదివాసుల అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలంటూ ఎమ్మెల్యే జోగు రామన్నకు సవాల్ విసిరారు. కుమురంభీం ఆశయాలను సాధించేది. కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. పోడు భూమి సాగుదారులకు పట్టాలు ఇప్పిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మెన్ ముడుపు దామోదర్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ చైర్మెన్ షెడ్మకి ఆనంద్‌రావు, నాయకులు ఐనేని సంతోష్‌రావు, డేరా కృష్ణారెడ్డి, ఎంఏ. షకీల్, కొండూరి రవి, మానే శంకర్ ఉన్నారు.


ఆదిలాబాద్‌టౌన్‌లో..


ఇంద్రవెల్లిలో..

ఆదిలాబాద్ రూరల్ : అమరజీవి కుమురంభీం 83వ వర్ధంతిని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ అదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కుమురంభీంగూడలో ఘనంగా నిర్వహించారు. శనివారం వర్ధంతిని డోలు, తుడుం, ఖాళీకోమ్, వాయిద్యాల మధ్య ఆదివాసీ ప్రజలు అందరూ భీం వర్ధంతిని ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యేశించి గోడం గణేష్ మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం సిద్ధించి 76, సంవత్సరాలు గడుస్తున్నా ఆదివాసుల బ్రతుకుల్లో ఎలాంటి మార్పు రాలేదని అన్నారు. కుమురంభీం అమరుడై 80 సంవత్సరాలు దాటుతున్న ఆదివాసులకు జల్, జంగల్, జమీన్‌పై హక్కులు కల్పించలేదని తెలియజేశారు. నివాసం ఉండటానికి కనీస నివాస స్థలాలు కేటాయించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఆదివాసుల మనుగడ ఆదివాసుల అస్తిత్వం ప్రమాదంలో ఉందన్నారు. ఆదివాసులందరూ ఐక్యంగా ఉండి మన హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. నేడు విద్యాపరంగా ఆదివాసులు చాలా వెనుకబడి ఉన్నారని అన్నారు. విద్యా లేకనే కోమురం భీమ్ చాలా బాధ పడేవారు అన్నారు. మనందరం కలిసి పోరాడి హక్కులను సాధిద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో వెట్టి మనోజ్, జిల్లా ప్రచార కార్యదర్శి గోడం రేణుక, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఉయిక ఇంద్ర, మావల మండల అధ్యక్షులు వెడ్మ ముకుందరావు, మండల ప్రధానకార్యదర్శి వివిధ గ్రామాలకు చెందిన గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆదిలాబాద్‌టౌన్ : కుమురంభీంకు నివాళులర్పిస్తున్న టీఏజీఏస్, సీఐటీయూ నాయకులు


తాంసిలో...

ఇంద్రవెల్లి : ప్రతి ఒక్కరూ కుమురంభీం ఆశయాలను నెరవేర్చాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, తుడుం దెబ్బ నాయకులు అర్క కమ్ము అన్నారు. శనివారం గోండుగూడలో ఆయన 83వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ కుమురంభీం ఆనాడు జల్.. జంగిల్... జమీన్... అనే నినాదంతో ఆదివాసుల హక్కుల కోసం పోరాడుతామని గుర్తు చేశారు. నిజాం సర్కార్ ఆయనకు తుపాకితో కాల్చి చంపడం దారుణమన్నారు. ఆదివాసులు కలిసి కట్టుగా ఉండి ఆయన ఆశయాలను సాధించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసుల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాలు అర్హులైన భూమి సాగు చేస్తున్న భూములకు హక్కు పత్రాలు అందించాలని అన్నారు. ఏజెన్సీలోని ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోరెంగ గాంధారి, పెందుర్ కృష్ణ, ఇందు పటేల్, చాకటి నాగోరావ్, బారిక్‌రావ్ ఉన్నారు.

ఉట్నూర్ : ఆదివాసీ హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసి అమరుడైన కుమురంభీం వర్ధంతి వేడుకలను శనివారం మండలంలోని ప్రతి ఆదివాసీ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. అదే విధంగా స్థానిక కేబి ప్రాంగణంలో ఉన్న కుమురంభీం విగ్రహం వద్ద ఆదివాసీ నాయకులు పూజలు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాయి సెంటర్ జిల్లా సార్మేడి మెస్రం దుర్గు పటేల్ మాట్లాడుతూ ఆదివాసుల హక్కులకై ఉద్యమాలు చేసి వీర మరణం పొందిన గొప్ప వీరుడన్నారు. ఆయన పోరాట స్పూర్తితో ఆదివాసులకు హక్కులు వచ్చాయన్నారు. ఆయనను నేటి ఆదివాసీ సమాజం ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయి సెంటర్ జిల్లా కోశాధికారి మడవి ఆనంద్‌రావు, జై ఆదివాసీ యువశక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ హన్మంత్‌రావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు మండాడి చంద్రభాన్, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుడ్మేత తిరుపతి, నాయకులు తొడసం దేవ్‌రావు, భగవంత్‌రావు, గుస్సాడీ బృందం సభ్యులు ఉన్నారు.

తాంసి : ఆదివాసీ గిరిజన ఆరాధ్యుడు కుమురంభీం 85వ వర్థంతిని శనివారం అంబుగాం గ్రామంలో గిరిజన సాంప్రదాయ పద్ధతిలో గ్రామస్తులు అందరితో జెడ్పీటీసీ, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు గ్రామంలో డోలు వాయిస్తు విగ్రహం వద్దకు వచ్చి ఆదివాసీ జెండాను ఆవిష్కరించి కుమురంభీం పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ మండల అధ్యక్షులు భరత్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన ఆరాధ్యుడు జల్.. జంగల్.. జమీన్.. పోరాట యోధుడు కుమురంభీం చేసిన పోరాట ఫలితంగా గిరిజనులకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన మా గిరిజన తెగకు చెందిన బతుకుల్లో పూర్తిస్థాయి వెలుగు కనబడటం లేదని వారు పేర్కొన్నారు.

మా గ్రామాలకు ఇప్పటివరకు కూడా నీటి సమస్యతో పాటు అనేక సమస్యలు ఉన్నాయన్నారు. మా గిరిజన సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం అయితేనే కుమురంభీంకు ఘనమైన నివాళి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యశ్వంత్, జెడ్పీటీసీ రాజు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు కృష్ణ, సంతోష్, రామన్న యాదవ్, ఎస్సై శివరామ్, గ్రామస్తులు, పోచ్చిరాం, సంబాజీ ఉన్నారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం అక్టోబర్, 29 2023

రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే : ఎమ్మెల్యే కోనప్ప

నవతెలంగాణ-దహెగాం

రాబోయే రోజుల్లో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శనివారం మండలంలోని ఇట్యాల, రాళ్లగూడ, కొత్మీర్ గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాయమాటలు చెప్పి మోసం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి మాయగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. చివరి శ్వాస వరకు సిర్పూర్ ప్రజల కోసమే పనిచేస్తానని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట ఆత్మ చైర్మన్ కొమురా గౌడ్, జడ్పీటీసీ తాళ్లపెల్లి శ్రీరామారావు, నాయకులు గజ్జెల సురేష్, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

భీం ఆశయాలను తుంగలో తొక్కిన ప్రభుత్వాలు

- ప్రజా సంఘాల నాయకుల విమర్శ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జల్ జంగల్ జమీన్ కోసం పోరాటం చేసిన కుమురంభీం ఆశయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కాయని ఆదివాసి ప్రాంతాలు నేటికీ అభివృద్ధికి నోచుకోలేదని ప్రజాసంఘాల నాయకులు విమర్శించారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో పోరాటయోధుడు కుమురంభీం 83వ వర్ధంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు రాజేందర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గేడం టికానంద్, గొడిసెల కార్తీక్ మాట్లాడుతూ ప్రజల కోసం పని చేసిన వారిని ఈ సమాజం ఎప్పటికీ మర్చిపోదన్నారు. నాడు భీం జల్, జంగల్, జమీన్ హమారా అనీ పోరాటం చేశారని కాని నేటి పాలకులు వాటికి దూరం చేస్తున్నాయని అన్నారు. ఒక్కప్పుడు భూమిలేని ఆదివాసులు లేరని కానీ నేడు చాలా మంది భూమి నుంచి తరిమివేయబడ్డారని, ప్రాజెక్టుల పేరుతో, అభివృద్ధి పేరుతో వారి నుంచి ప్రభుత్వాలు భూములు లాక్కుంటున్నాయని ఆరోపించారు. కేంద్ర సర్కార్ నూతన అటవీ పరిరక్షణ చట్టాన్ని తీసుకు వచ్చి అడవులను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పి ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టడానికి ప్రయత్నాలు ప్రారంభించిందని దీన్ని మూకుమ్మడిగా తిప్పి కొట్టాలని అన్నారు. జిల్లాలో అనేక గిరిజన గ్రామాలు నేటికీ రోడ్డు సౌకర్యం లేక వర్షాకాలం వస్తే బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే దుస్థితి దాపరించిందన్నారు. వైద్య సేవల గురించి వేరే చెప్పనక్కరలేదని ఎద్దేవా చేశారు. ఆదివాసీల కోసం పోరాడిన కొమరం భీం సాక్షిగా మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వాలను ప్రశ్నించినప్పుడే పనులు పూర్తయితాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమచారి, దుర్గం లలిత, శ్రీలత, జ్యోతి, లలిత, జంగుబాయి పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



కౌటాలలో భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

నవజ్యోతి సాంస్కృతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సినీ, టీవీ రచయిత, నిర్మాత, నటుడు, దర్శకుడు, టీవీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగబాల సురేష్ కుమార్ భీమ్ విగ్రహానికి పూలమాల వేసి ఆయన కీర్తిని స్తుతించారు. భీం ఆశయాలను కొనసాగించడానికి ఆదివాసులతోపాటు అందరూ కూడా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : గోండు బెబ్బులి, ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన యోధులు, నిజాం సర్కారుకు వ్యతిరేకంగా పోరాడిన సాయుధ పోరాట వీరుడు కొమురంభీం 83వ వర్ధంతి సందర్భంగా శనివారం పలు సంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళ్లర్పించారు. మండలంలోని డాడా నగర్ చౌరస్తాలోగ భీం విగ్రహానికి పూల మాల వేశారు. పట్టణ పద్మశాలి సేవా సంఘం, పీఆర్టీయూ టీఎస్, ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం, గువ్వలగూడలో ఆదివాసీ కొలవార్ సంఘం ఆధ్వర్యంలో పూల మాల వేసి ఘన నివాళ్లర్పించారు.

కౌటాల : కుమురం భీం వర్ధంతిని పురస్కరించుకొని శనివారం మండలకేంద్రంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప భీం విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పూజలు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ కోసం పోరాడి వీరమరణం పొందిన భీం గొప్ప యోధుడన్నారు. ఆదివాసుల ఆరాధ్యదైవమని, కుమురం భీం జిల్లా సైతం ఈయన కోసమే ఏర్పడిందని, ఆయనను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని అడుగుజాడల్లో నడవాలన్నారు. పోడు భూముల కోసం పోరాడిన ఆయన ఆశయ సాధనలో గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చిన ఘనత మన సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీలు బసార్కర్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదె వసంత్‌రావు, తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్మిక సంఘాల సోషల్ మీడియా జిల్లా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సీఐటీయూ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు రాజేందర్, జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణమాచారి ఆధ్వర్యంలో కార్మిక సంఘాల సోషల్ మీడియా నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.జిల్లా కన్వీనర్‌గా వెలిశాల కృష్ణమాచారి, కోకన్వీనర్‌గా ఫహీమ, జిల్లా బాధ్యులుగా ఆయా రంగాల వారీగా గ్రామపంచాయతీ రంగం నుండి పెరక శ్రీకాంత్, ఆశా నుంచి దుర్గం లలిత, మధ్యాహ్న భోజన పథకం నుంచి పెందుర్ సుమిత్రా, మడావి లలితా, హాస్టల్ వర్కర్స్ నుంచి సోయం జ్యోతీ, పశుమిత్ర నుంచి కుడ్మేత శ్రీలతలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ నూతన కమిటీ కార్మికుల సమస్యలపై ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో ప్రచారం చేయాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను సోషల్ మీడియా వేదికగా ఎండగట్టాలన్నారు. కార్మికులకు అండగా ఉండడంతో పాటు వారి సమస్యల పరిష్కారం కోసం కమిటీ కృషి చేయాలన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్

'కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్లు అమ్ముకుంది'

నవతెలంగాణ-ఆసిఫాబాద్

టికెట్లు ఇవ్వడంలో కాంగ్రెస్ తనకు అన్యాయం చేసిందని అదే సందర్భంలో టికెట్లను అమ్ముకుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మర్సుకోల సరస్వతి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని తన ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చివరి వరకు తనకు టికెట్ ఇస్తానని పార్టీ మోసం చేసిందన్నారు. 2006 తో పాటు, 2014లో, 2018లో కూడా తనను విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసిఫాబాద్ వచ్చిన వలసవాది శ్యాం నాయక్‌కు టికెట్ ఇవ్వడం దారుణం అన్నారు. సర్వేలతోపాటు కాంగ్రెస్ పెట్టిన ప్రతి పరీక్షలో కూడా తానే అర్హురాలిగా నిలిచినప్పటికీ డబ్బులు తీసుకుని శ్యామ్ నాయక్‌కు టికెట్ ఇచ్చారన్నారు. బోరజ్ చెక్‌పోస్టులో శ్యాం నాయక్ చేసిన అవినీతి ప్రతి ఒక్కరికి తెలుసని కిందిస్థాయి ఉద్యోగులు ఆయనపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయగా ఉద్యోగం నుంచి తొలగించబడతానని భయంతో విఆర్ఎస్ తీసుకున్నట్లు ఆరోపించారు. ఆయన పెద్ద దొంగ, అవినీతిపరుడు అని తీవ్రస్థాయి ఆరోపణలు చేశారు. ఇదే సందర్భంలో ప్రజాసేవ కోసమే వీఆర్ఎస్ తీసుకుంటున్నట్లు ప్రజలను నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కార్యకర్తలతో మాట్లాడి తన నిర్ణయం వెల్లడిస్తానని తెలిపారు. తప్పనిసరిగా పోటీలో ఉంటానని శ్యామ్ నాయక్‌ను ఓడించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 9 తేగలకు సంబంధించి 90000 ఓట్లు ఉన్నాయని, లంబాడీల ఓట్లు కేవలం 15000 మాత్రమే ఉన్నాయని గుర్తు చేశారు. లంబాడి తెగకు చెందిన వ్యక్తికి పార్టీ టికెట్ ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. కుమురం భీం నడయాడిన నియోజకవర్గంలో ఆదివాసీలకు అన్యాయం చేయడం దారుణం అన్నారు. ఆదివాసీలను కూడగట్టుకుని భవిష్యత్తు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఇందిరమ్మ రాజ్యాన్ని సాధిద్దాం: కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సామాన్య ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని, అప్పుడే ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి రావి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని టోంకిని గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి తప్పా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులు ఎక్కడ కూడా కనబడడంలేదన్నారు. ఈ ప్రభుత్వం కేవలం భూ కబ్జాలు, ఇసుక మాఫియా, స్కాంలకే పాల్పడిందని ఆరోపించారు. ప్రజల మేలు ఏ మాత్రం కోరలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నియోజకవర్గంలో కొబ్బరికాయలు పట్టుకొని ఊరూర తిరుగుతూ కొట్టడం తప్పా చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి ఇందిరమ్మ ఇండ్లు, గృహలక్ష్మి పథకం క్రింద మహిళలకు నెలకు రూ.2500, రూ. 500 గ్యాస్ సిలీండర్, వృద్ధులకు రూ.4 వేలు, పేదింటి ఆడబిడ్డల పెండ్లికి రూ.లక్ష, తులం బంగారం, ఆరు గ్యారెంటీలను ప్రతి ఒక్కరికి చేరేలాగా బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.

నేడు బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం

నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రంలోని కేకే గార్డెన్‌లో ఆదివారం బీఆర్ఎస్ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం హాజరవుతారని, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



వరిలో కంకినల్లి, సుడి దోమ నివారించండి

నవతెలంగాణ-భీమారం

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పైరును కంకినల్లి, సుడి దోమ ఆశిస్తుందని, దాని నివారణకు అధికారులు సూచించే చర్యలు పాటించాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి బొల్లపల్లి అరుణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని అంకుశాపూర్ శివారులో వరి క్షేత్రాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పైరులో కంకినల్లితో పాటు సుడిదోమ ఆశించినట్లు గుర్తించారు. వీటి నివారణకు ప్రొఫినోఫాస్ 400 మి.లీ, డైనోటెపురాన్ 80 గ్రాములు లేదా పైమెట్రోజెన్ 120 గ్రాముల చొప్పున ఎకరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగులు భాగస్వామ్యం కావాలి



నవతెలంగాణ-కాసిపేట

రక్షణలో ప్రతి ఉద్యోగి భాగస్వామ్యం కావాలని సేఫ్టీ కమిటీ కన్వీనర్ జి నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిపై 54వ రక్షణ పక్షోత్సవాలను ప్రారంభించారు. ముందుగా కార్పోరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య, ఏరియా జేఎం మనోహర్, రీజినల్ సేఫ్టీ జీఎం గుప్తాతో కలిసి ఆయన గనిని తనిఖీ చేశారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో తక్కువ ప్రమాదాలు నమోదవడం పట్ల సేఫ్టీ జీఎంను అభినందించారు. ప్రతి ఉద్యోగి రక్షణలో భాగస్వామ్యమై రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని కన్వీనర్ నాగేశ్వర్ రావ్ సూచించారు. ప్రమాదరహితంగా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అత్యవసర పరిస్థితులో నిర్వహించే సీపీఆర్ చేసే పద్దతిని రెస్క్యూ సిబ్బంది తెలియజేస్తూ అవగాహన కల్పించారు. భద్రత వారోత్సవాల్లో ఉత్తమ ప్రతిభ కనభరిచిన ఉద్యోగులకు బహుమతులు అందించారు. భద్రతకు సంబంధించి కమ్యూనికేషన్ సెల్ సిబ్బందితో నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సెఫ్టీ కమిటీ కోకన్వీనర్లు ప్రవీణ్ విక్రం, సాయినాధ్, ఏజెంట్ రాందాస్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ. ఏరియా రక్షణాధికారి రవీందర్, ఇంజనీర్ రాంప్రసాద్. సంక్షేమాధికారి భరత్ పాల్గొన్నారు.

కాసిపేట బీఆర్‌ఎస్‌లో అసమ్మతి సెగ

- కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురి సన్నాహాలు
- కొనసాగుతున్న బుజ్జగింపులు



నవతెలంగాణ-కాసిపేట

మండలంలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్‌కు భారీగా వలసలు వెళ్లే అవకాశం ఉండడంతో హాట్ టాపిక్‌గా మారింది. కాసిపేట మండలంకు చెందిన బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు పలువురు కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమైనట్టు సమాచారం. ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ కండువా కప్పుకోడానికి సిద్ధమవగా రెండు రోజుల్లో వారంతా కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలుస్తుంది. వీరిని బుజ్జగించడానికి ఎంపీ వెంకటేష్ నేత స్వయంగా దిగి మంతనాలు చేస్తున్నారు. వీరంతా ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అభ్యర్థిత్వంపై అసంతృప్తితోనే పార్టీ మారుతున్నట్లు తెలుస్తోంది. వైస్ ఎంపీపీ విక్రం రావు నేతృత్వంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, సహకార సంఘం చైర్మన్ నీలా రాంచందర్‌తో సహా ఐదుగురు ఎంపీటీసీలు, 15 మంది సర్పంచ్‌లు, పలువురు ముఖ్య నాయకులు పార్టీ మారేందుకు సిద్ధం కాగా స్వయంగా ఎమ్మెల్యే వెళ్లి మంతనాలు చేసినా వినకపోవడంతో ఎంపీ వెంకటేష్ నేత, ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ రావు రంగంలో దిగారు. అసంతృప్తి నేతలతో సమావేశమై చర్చలు జరిపారు. దింతో ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చితే మద్దతు ఉంటుందని, లేదా పార్టీ మారనున్నట్లు నేరుగా తెగేసి చెప్పినట్లు వైస్ ఎంపీపీ విక్రం రావు తెలిపారు. గతంలో ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ నాయకులను, ప్రజా ప్రతినిధులను తీవ్రంగా ఇబ్బంది పెట్టినట్లు ఆరోపణలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. ప్రస్తుతం కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు వైస్ ఎంపీపీ విక్రం రావు, జడ్పీటీసీ చంద్రయ్య, సహకార చైర్మన్ నీలా రాంచందర్, దేవాపూర్ ఓసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతిరెడ్డి, ఐదుగురు ఎంపీటీసీలు, 15 మంది సర్పంచ్‌లు, పలువురు ముఖ్య నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకొనున్నట్లు సమాచారం. ఫైనల్ గా అసంతప్తి నేతల దారి ఎటో నేడో, రేపో తెలియనుంది.

బీఆర్‌ఎస్ గెలిస్తే అర్హులైన మహిళలకు భృతి

నవతెలంగాణ-తాండూర్



బీఆర్‌ఎస్ గెలిస్తే అర్హులైన ప్రతి మహిళకు రూ.3 వేల చొప్పు ప్రతి నెల భృతి అందజేస్తామని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. శనివారం బెల్లంపల్లి మండలంలోని లంబాడితాండ, తాళ్ళగురిజాల, మాలగురిజాల, దుగ్నేపల్లి గ్రామపంచాయతీలల్లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతం చేసిందన్నారు. రైతు బీమాను పేద ప్రజలందరికీ వర్తించేలా పథకాన్ని రూపొందించిందని, రైతుబంధును రూ.16 వేలు ఇస్తామని తెలిపారు. కాంగ్రెస్ ఉచిత పథకాలను ప్రజలు నమ్మవద్దన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుల పరిస్థితి అధ్వానంగా తయారవుతుందన్నారు. ప్రచారంలో నాయకులు దొంగల సత్యనారాయణ, బెల్లంపల్లి ఎంపీపీ గోమాస శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో జారుడు బండ లాంటి వాగ్దానాలు

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కలిందర్ అలీఖాన్

తెలంగాణ-జన్నారం

నీళ్ల నిధులు నియామకాలు పేరుతో గద్దెనెక్కిన కేసీఆర్ ప్రభుత్వం గిరిజన మైనార్టీలకు రిజర్వేషన్ల పెంపు గిరిజనులకు పోడు భూముల పట్టాలు నామమాత్రంగా ఇచ్చి చేతులు దులుపుకుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళిందర్ ఖాన్ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కలిందర్ అలీఖాన్

ఏర్పాటుచేసిన పత్రిక విలేకరులతో ఆయన మాట్లాడారు. తెలంగాణ బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన నిరుద్యోగ భృతి నిరుద్యోగులకు ఏ ఒక్క నోటిఫికేషన్ కూడా సక్రమంగా అమలు చేయలేదన్నరు. ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్ పేరుమీద లక్షలాదిమంది నిరుద్యోగులు అప్లై చేసుకుని పరీక్షలు రాస్తే, కోర్టు కేసులు పేపర్ లీకేజీల పేరు మీద వాయిదాల మీద వాయిదాలు పడుతూయన్నరు. నిరుద్యోగులు నిరాశ నిస్పృహలకు లోనై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. మొన్నటికి మొన్న ప్రవళిక ఆత్మహత్య మన కండ్ల ముందు కదులుతూనే ఉందన్నరు. కేజీ టు పీజీ ఉచిత విద్య పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు గృహలక్ష్మి బీసీ బంధు దళిత బంధు రైతులకు సబ్సిడీ విత్తనాలు ఎరువులు రైతు రుణమాఫీ చేయడంలో ఆ ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి దానరి తిరుపతి, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, దేవి పోచన్న, చాల మహేందర్‌రెడ్డి, నాయకులు బియ్యల రాజేశం, అబ్దుల్లా, మామిడి విజయ్ పాల్గొన్నారు.

ఇంటింటా బీఎస్పీ అభ్యర్థి ప్రచారం

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) అభ్యర్థి, నస్పూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ తోట శ్రీనివాస్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. బహుజన సామాజిక వర్గాల నుండి మద్దతు తెలిపి తనను బీసీ అభ్యర్థిగా గెలిపించాలని కోరారు. ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. తనను గెలిపిస్తే నిజాయితీగా పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట పార్టీ జిల్లా నాయకులు ఆవును రవీందర్, కార్యకర్తలు ఉన్నారు.

అలరించిన మ్యూజికల్ బ్యాండ్ కార్యక్రమం

నవతెలంగాణ-హాజీపూర్

పోలీసుల అమరవీరు సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గుడిపేట 13వ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ మ్యూజిక బ్యాండ్ కార్యక్రమం అలరించింది. శనివారం ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద ప్రజల సందర్శన కోసం ప్రదర్శన నిర్వహించారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను అర్పిస్తున్న పోలీసుల త్యాగలను గుర్తించాలని ఈసందర్భంగా పోలీసులు కోరారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా, అసిస్టెంట్ కమాండెంట్ చౌహాన్, ఆర్ఐలు కుమార్ స్వామి, శ్రీనివాస్, మారుతి, గోపి, రవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు రోటీగూడ విద్యార్థులు

నవతెలంగాణ-జన్నారం

ఎస్‌సీఎఫ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి యోగ పోటీలలో అండర్-14 విభాగంలో ఎన్ మనితేజ, అండర్-17 విభాగంలో ఎస్.హర్మిథ్ సాయి ఎంపికయ్యారని రోటి గుడా ప్రభుత్వ పాఠశాల పీఈటీ శివ నూరి తిరుపతి తెలిపారు. ఈ నెల 30 నుంచి సిద్దిపేటలో జరిగే స్టేట్ లెవల్ యోగ పోటీలకు ఎంపికైనాట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను సర్పంచ్, మల్క విజయ లక్ష్మణ్, ఉప సర్పంచ్ భారతపు సత్యనారాయణ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఆరు గ్యారెంటీలు ప్రజలకు చేరితే విజయం సాధ్యం

నవతెలంగాణ-తాండూర్

కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ఆరు గ్యారెంటి వల్ల చేకూరే లబ్ధి ప్రజల వద్దకు చేరవేస్తేనే విజయం సాధ్యమవుతుందని బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ అన్నారు. శనివారం నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన అధ్యక్షులు, బూతు స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటిల అమలు విధానాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. రైతులు, మహిళలు, పేద ప్రజల కోసం అమలుపరిచే సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో వివరించాలన్నారు. గెలుపు కోసం కృషి చేసే కార్యకర్తలకు సమూచిత స్థానం లభిసుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఈసా, సూరిబాబు, మోహన్ జోషి పాల్గొన్నారు.

వీరుడా వందనం..!


కుమురంభీం విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న జడ్పీచైర్‌పర్సన్ కోవ లక్ష్మి

నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని గిరిజన పోరాట యోధుడు ఆదివాసుల ఆరాధ్య దైవం, కుమురంభీం వర్ధంతిని శనివారం పోరాటాలకు పురిటిగడ్డ అయినా జోడేఘాట్‌లో భీం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కలెక్టర్ బొర్కాడే హేమంత్, ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్ పాయ్, ఎస్పీ సురేష్ కుమార్, భీం మనుమడు కుమురంసోనేరావు కుటుంబ సభ్యులతో కలిసి డోలు వాయిద్యాల నడుమ సాంప్రదాయ పూజలను నిర్వహించారు. భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం భీం అనుచరుడు కుమురం సూరు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసుల హక్కుల కోసం వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వీరులను స్మరించుకున్నారు. సాంప్రదాయ పూజలు నిర్వహించారు. కలెక్టర్ బొర్కాడే హేమంత్ చేతుల మీదుగా కమురంభీం మనుమడు సోనేరావు దంపతులకు నూతన వస్త్రాలను బహుకరించారు.

భారీగా తరలివచ్చిన గిరిజనులు

ఆదివాసుల హక్కుల కోసం జల్ జమీన్ జంగిల్ అనే నినాదంతో నిజాం ప్రభుత్వంతో పోరాడి అసువులు బాసిన పోరాటయోధుడు కుమురంభీంకు నివాళ్లు అర్పించడానికి మహారాష్ట్ర, ఉమ్మడి జిల్లా నుంచి ఆదివాసు గిరిజనులు భారీగా తరళివాచ్చారు. భీం వర్ధంతి సందర్భంగా ఆదివాసులు పెద్ద ఎత్తున తరలి రావడంతో జోడేఘాట్ గ్రామమంతా జనసంద్రంగా మారింది. నిలువెత్తు విగ్రహం చుట్టూరా ఆదివాసి విద్యార్థులు డోలు వాయిద్యాల నడుమ సాంప్రదాయ నృత్యాలు చేశారు. ఈ సాంప్రదాయ నృత్యాలతో పాటు గిరి గుస్సాడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. భీం జీవిత చరిత్ర పై విద్యార్థులు చేసిన నాటకీయ ప్రదర్శన ఆదివాసులను ఉత్సహ పర్చింది.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

వర్ధంతికి తరలివచ్చిన ఆదివాసి గిరిజనులకు జోడేఘాట్ గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో రక్త నమూనా పరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి మందులు అందజేశారు. వర్ధంతి సభకు హాజరైన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. భోజన వసతితో పాటు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. జోడేఘాట్ వరకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించారు. ఎస్పీ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. అనుమానాస్పద వాహనాలను తనిఖీలు చేశారు. మ్యూజియం వద్ద ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి వర్ధంతికి హాజరైన ప్రజలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

స్వరాష్ట్రంలోనే ఆదివాసులకు అసలైన గుర్తింపు

జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి



గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో ప్రభుత్వాలు పరిపాలించినప్పటికీ తమ పోరాట వీరునికి అసలైన గుర్తింపు లభించలేదు. ఉద్యమ కాలంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చినటువంటి హామీ మేరకు జోడేఘాట్ గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారు. రూ.25 కోట్లతో ట్రైబల్ మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. జోడేఘాట్ గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా మార్చారు. నిల్వెత్ విగ్రహం ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుతో భీం వర్ధంతిని అధికారకంగా నిర్వహిస్తూ, ఆదివాసి సమాజానికి అసలైన గుర్తింపు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది.

భీం స్ఫూర్తితోనే తెలంగాణ సాకారం

ఎమ్మెల్యే ఆత్రం సక్కు



ఆదివాసుల హక్కులైనటువంటి జల్ జమీన్ జంగల్ కోసం ఆనాటి కాలంలో కుమురంభీం చేసినటువంటి పోరాట పటిమతో, భీం స్ఫూర్తి తోనే కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన సాకారం చేశారు. భీం ఆశయ సాధనకు కేసీఆర్ కృషి చేశారు. పోడు భూములకు పట్టాలు అందించారు. ఇప్పటికే అనేక గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగింది. మరికొన్ని పనులు చేయాల్సి ఉంది. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రాబోయే రోజుల్లో గిరిజన సమస్యలు పరిష్కరించేందుకు పాటుపడతాం.

కేసీఆర్ కృషి వల్లే జోడేఘాట్ అభివృద్ధి

కుమురంభీం మనవడు సోనేరావు



తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాతనే జోడేఘాట్ గ్రామంలో తాగునీరు, రోడ్డు రవాణా సౌకర్యాలు మెరుగుపడ్డాయి, గతంలో అనేక ప్రభుత్వాలను చూసిన ఏ ప్రభుత్వం జోడేఘాట్‌కు మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ 2014లో జోడేఘాట్ రాకతో ఆయన ఇచ్చిన హామీలను నెరవేర్చడం జరిగింది.

ఆధార్ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలో ఆధార్‌కార్డులో తప్పొప్పులున్న అభ్యర్థులను దృష్టిలో ఉంచుకొని ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్టు సిర్పూర్ సబ్ పోస్టుమాస్టర్ శ్రీనివాస్ తెలిపారు. కొన్ని రోజుల క్రితం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కేంద్రం ఉండేది. నిర్వాహకులు అవకతవకలకు పాల్పడడంతో అధికారులు ఆధార్ కేంద్రాన్ని మూసివేశారు. అభ్యర్థుల యొక్క సూచన మేరకు పోస్టాఫీసులో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి మేరకుపై అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కేంద్రం ఏర్పాటుకు ఉత్తర్వులు వచ్చాయన్నారు. శనివారం కేంద్రాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. కాగజ్‌నగర్, ఈజ్‌గాం కేంద్రాలకు వెళ్లకుండా స్థానికంగా ఉన్న కేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

పారిశుధ్య కార్మికుడు మృతి

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని ఎలుకపెల్లి(బి) గ్రామానికి చెందిన కోంగ్రడ బాపు(50) అనే పారిశుద్ధ్య కార్మికుడు శనివారం మృతిచెందాడు. పెద్ద సిద్ధాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతూ మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబాన్ని పెద్ద సిద్ధాపూర్ సర్పంచ్ రవికుమార్ పరామర్శించారు.

గనులపై ఎన్నికల ప్రచారం నిషేధం

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి గనులపై రాజకీయ పార్టీలు, అనుకూలంగా ఉన్న ట్రేడ్ యూనియన్‌లు నాయకుల ప్రచారాలను నిషేధిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ డి రవిప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి ప్రకారం సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు, డిపార్టుమెంట్లపై ఎలాంటి రాజకీయ ప్రచారాలు చేయడానికి వీలులేదన్నారు. ఉద్యోగులు నిబంధనలు ఉల్లంఘిస్తే కంపెనీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు జమల్పూరి సుధాకర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్యాం నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. 9 సంవత్సరాల బీఆర్ఎస్ పరిపాలనతో తెలంగాణ ప్రజలు విసిగిపోయారన్నారు. వైఎస్ఆర్ టీపీని వదలడం బాధాకరంగా ఉందన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయం అన్నారు. శ్యాం నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి టికెట్ కేటాయించిన అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అందరిని కలుపుకొని వెళ్తానని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండ శ్యామ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో


రాస్తారోకో నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో టికెట్ ఆశించి బంగపడిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరస్వతి, పీసీసీ సభ్యుడు గణేష్ రాథోడ్‌లు తమ వర్గీయులతో కలిసి సరస్వతి ఇంటి నుంచి ర్యాలీగా వచ్చి కుమురంభీం విగ్రహానికి పూలమాలవేసి చౌక్ వద్ద "పారాషఉట్ కో హటావో, కాంగ్రెస్‌కో బచావో" అనే నినాదంతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వేరే ప్రాంతం నుంచి వచ్చిన వ్యక్తికి టికెట్ కేటాయించడం దారుణం అన్నారు. 2018 సంవత్సరంలో పార్టీ నుంచి గెలిచి ఎమ్మెల్యే సక్కు అధికార పార్టీలోకి వెళ్ళినప్పటి నుంచి పార్టీ అభివృద్ధి కోసం నియోజకవర్గంలో కృషి చేశామన్నారు. సర్వేలతో సంబంధం లేకుండా టికెట్ కేటాయించారని ఆరోపించారు. వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకొని టికెట్ కేటాయింపులో జరిగిన అన్యాయాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే తమ సత్తా ఏమిటనేది చూపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ నిజాం, ఇస్మాయిల్, శంకర్, ప్రశాంత్, పరశురాం, రాము, ప్రభాకర్, లింగు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్, కామర్స్ అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థులు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ కనకయ్య శనివారం తెలిపారు. దీనికి సంబంధించిన సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతం మార్కులతో పాసై డిగ్రీ స్థాయిలో ఆంగ్లమాధ్యమంలో బోధన అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. పీహెచ్‌సీ నెట్‌సెట్ అర్హత ఉన్న అభ్యర్థులకు ఇందులో అధిక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాల కోసం కళాశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.